


ఆర్ఎన్ఐ/2009/ 28733 స్థాపితం : 2003

# ఆంధ్రనాడు

తెలుగు దినపత్రిక

సంపుటి : 22 సంచిక: 49 తిరుపతి తేది : బుధవారం 20 మే 2026 పేజీలు : 08 ధర : రూ.6 PUBLISHED FROM TIRUPATI, CHITTOOR, ANNAMAIAH, ANANTHAPUR DISRICTS

## నైజీరియాలో భీకర దాడులు..

### 175 మంది ఉగ్రవాదుల హతం

నైజీరియా - ఆంధ్రనాడు, మే 19



పశ్చిమాఫ్రికా దేశం నైజీరియాలో ఇస్లామిక్ స్టేట్ (ఐసిస్) ఉగ్రవాదులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. దేశ ఈశాన్య ప్రాంతంలో అమెరికా, నైజీరియా బలగాలు సంయుక్తంగా జరిపిన వైమానిక దాడుల్లో 175 మందికి పైగా ఐసిస్ ఫైటర్లు హతమయ్యారు. ఈ విషయాన్ని నైజీరియా సైన్యం అధికారికంగా ధ్రువీకరించింది. నైజీరియా ఆర్మీ అధికార ప్రతినిధి సమైలా ఉబా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "యుద్ధ క్షేత్రంలో 175 మందికి పైగా ఐసిస్ మిలిటెంట్లు హతమయ్యారు" అని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో ఉగ్రవాదుల చెక్‌పోస్టులు, ఆయుధ డిపోలు, లాజిస్టిక్స్ కేంద్రాలతో పాటు వారికి నిధులు సమకూర్చే నెట్‌వర్క్‌ల ప్రధాన కార్యాలయాలను కూడా ధ్వంసం చేసినట్లు వివరించారు. కొన్ని నెలలుగా నైజీరియా, అమెరికా మధ్య సైనిక సహకారం గణనీయంగా పెరిగింది. గత వారం కూడా ఇరు దేశాల బలగాలు సంయుక్తంగా జరిపిన ఆపరేషన్‌లో ఐసిస్ గ్లోబల్ సెకండ్-ఇన్-కమాండ్ అబు-బిలాల్ అల్-మినుకి హతమయ్యాడు. తీవ్రవాదంపై పోరాటంలో ఇది ఒక కీలక సహకారానికి నిదర్శనమని నైజీరియా అధ్యక్షుడు బోలా టినుబు పేర్కొన్నారు. ఈ ఆపరేషన్‌పై అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందిస్తూ, తన ఆదేశాల మేరకు అమెరికా, నైజీరియా బలగాలు ఈ క్లిష్టమైన ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశాయని తన 'ట్రూత్ సోషల్' ఖాతాలో తెలిపారు.



### ఐస్‌లాండ్ ప్రధానితో పీఎం మోడీ భేటీ

న్యూఢిల్లీ - ఆంధ్రనాడు, మే 19

ప్రధాని మోడీ ఐదు దేశాల పర్యటనలో భాగంగా ఐస్‌లాండ్ ప్రధాని క్రిస్ట్రాన్ మ్జోల్ ఫ్రోస్టాడోట్టిర్‌తో మోడీ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే అంశాలపై చర్చించినట్లు మోడీ వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ.. "ఐస్‌లాండ్ ప్రధాని క్రిస్ట్రాన్ మ్జోల్ ఫ్రోస్టాడోట్టిర్‌తో అద్భుతమైన సమావేశం జరిగింది. ఐస్‌లాండ్‌తో ఉన్న స్నేహబంధాన్ని భారత్ ఎంతో విలువైనదిగా భావిస్తోంది. స్వచ్ఛ ఇంధనం, మత్స్య రంగం, సస్టైనబిలిటీ,

- మిగతా 2లో..

### 2 లక్షల మెట్రిక్ టన్నుల 'బాయిల్డ్ రైస్' సేకరణకు కేంద్రం అంగీకారం

- పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

న్యూఢిల్లీ - ఆంధ్రనాడు, మే 19



రాష్ట్రం నుంచి 2 లక్షల మెట్రిక్ టన్నుల 'బాయిల్డ్ రైస్' సేకరణకు కేంద్రం అంగీకరించిందని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా ప్రజా పంపిణి వ్యవస్థ ద్వారా సరఫరా చేసే బియ్యంలో '10 శాతం నూకలు' (బ్రోకాన్ రైస్) విధానం అమలు చేసేందుకు కేంద్రం అంగీకరించిదన్నారు. మంగళవారం నాడిక్కడ కేంద్ర పౌరసపరాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో మంత్రి నాదెండ్ల మనోహర్ భేటీ అయ్యారు. అలాగే ఎఫ్‌సిఐ, కేంద్ర ప్రజా పంపిణీ,

- మిగతా 2లో..

## రాబోయే రోజుల్లో 'కనకపట్నం'గా కావలి

- కావలి నియోజకవర్గం తుమ్మలపెంటలో చంద్రబాబు సభ
- మత్స్యకార సేవలో భాగంగా 1.30 లక్షల కుటుంబాల ఖాతాల్లోకి రూ.262 కోట్లు జమ
- వేట నిషేధ భృతిని రూ.10 వేల నుంచి రూ.20 వేలకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం
- తీరం మనదే, వేట మనదేనని.. ఇతర రాష్ట్రాల మత్స్యకారులను అనుమతించేది లేదని స్పష్టీకరణ
- కావలికి పలు అభివృద్ధి పనుల మంజూరు
- వేదికపైనే అధికారుల పనితీరును సమీక్షించిన సీఎం




నెల్లూరు- ఆంధ్రనాడు, మే 19

రాష్ట్రంలోని మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపడమే తన ప్రభుత్వ లక్ష్యమని, వారి ఆర్థికాభివృద్ధే ధ్యేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గంలోని తుమ్మల పెంటలో మంగళవారం జరిగిన 'మత్స్యకార సేవలో' కార్యక్రమంలో ఆయన పాల్గొని సుదీర్ఘ ప్రసంగం చేశారు. వేట నిషేధ సమయంలో మత్స్యకార కుటుంబాలకు అండగా నిలిచేందుకు 1,30,796 కుటుంబాలకు రూ. 20,000 చొప్పున మొత్తం రూ. 262 కోట్లను వారి బ్యాంకు

- మిగతా 2లో..




### నేడు మెడికల్ షాప్స్ బంద్..

న్యూఢిల్లీ - ఆంధ్రనాడు, మే 19

ఆన్‌లైన్‌లో ఈ-ఫార్మసీలు, పెద్ద కార్పొరేట్ కంపెనీలు భారీ డిస్కౌంట్లతో మందులను విక్రయించడాన్ని వ్యతిరేకిస్తూ ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో నేడు(బుధవారం) దేశవ్యాప్తంగా రిటైల్ మెడికల్ షాపులు మూతపడనున్నాయి. అయితే అపోలో, మెడ్‌ప్లస్ వంటి మెయిన్ చైన్ షాప్స్, దవాఖానలకు అనుబంధంగా ఉండే మందుల షాపులు, ప్రభుత్వ దవాఖానల ఔషధ కేంద్రాలు, 24 గంటల పాటు పని చేసే ఫార్మసీలు, జన్ ఔషధి కేంద్రాలు తెరిచే ఉండానున్నాయియి. అవసరమైన మెడిసిన్స్ కోసం వాటిని సంప్రదించండి.

### బీసీలకు నెలకు రూ.50 వేల ఆదాయమే లక్ష్యం

- బీసీలకు శాశ్వత ఉపాధి కల్పించే లక్ష్యంతో ఆదరణ 3.0 పథకమన్న మంత్రి సవిత
- ఈ పథకం కోసం రూ.1000 కోట్లు కేటాయిస్తున్నామని వెల్లడి
- కులవృత్తుల వారికి ఆధునిక పనిముట్లు, నైపుణ్యశిక్షణ ఇస్తామన్న మంత్రి

అమరావతి - ఆంధ్రనాడు, మే 19



బీసీలకు శాశ్వత ఉపాధి కల్పించి, వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు. ఇందుకోసం 'ఆదరణ 3.0' పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఆమె తెలిపారు. మంగళవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో బీసీ సంక్షేమ శాఖ అధికారులతో ఈ పథకం అమలుపై ఆమె సమీక్ష నిర్వహించారు. ఆదరణ 3.0 పథకానికి ప్రభుత్వం రూ.1000 కోట్లు కేటాయిం చిందని మంత్రి సవిత వెల్లడించారు. ఈ పథకం ద్వారా కుల వృత్తిదారులకు ఆధునిక పనిముట్లు అందించి, వారిని వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దనున్నట్లు వివరించారు. గతంలో ముఖ్యమంత్రి

- మిగతా 2లో..

### స్విచ్‌లు నొక్కడం తప్ప జగన్ చేసిందేమీ లేదు

- వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారన్న షర్మిల
- బటన్లు నొక్కినంత మాత్రాన మళ్లీ సీఎంలు కాలేరని ఎద్దేవా
- వైఎస్సార్ ఆశయాలను నాశనం చేశారని మండిపాటు

అమరావతి - ఆంధ్రనాడు, మే 19



వైసీపీ అధినేత, తన సోదరుడు జగన్ పై ఏపీ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్ ఆశయాలకు జగన్ తూట్లు పొడిచారని ఆమె ధ్వజమెత్తారు. వైఎస్సార్ పేరు చెప్పుకుని 'ఒక్క ఛాన్స్' అంటూ సీఎం అయిన జగన్, ఐదేళ్ల పాలనలో కేవలం స్విచ్‌లు నొక్కడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కేవలం బటన్లు నొక్కితే మళ్లీ మళ్లీ సీఎంలు కాలేరని, కనీసం ఎమ్మెల్యేలు, ఎంపీలకు

- మిగతా 2లో..

ANDHRANADU
TELUGU DAILY

బుధవారం
20.05.2026

తిరుపతి – చిత్తూరు
అన్నమయ్య– అనంతపురం
ఆంధ్రనాడు

# కర్ణాటక ఉప ముఖ్యమంత్రి కి సన్మానం



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 19:** విమా నాశ్రయంలో కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు. విమానాశ్ర యంలో మర్యాదపూర్వకంగా కలిసి శ్రీకాళహస్తి క్షేత్ర విశిష్టతను మరియు ముక్కంటి మహిమలను తెలియజేశాను. అనంతరం శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వ ర స్వామివారి దివ్య తీర్థప్రసాదాలను, స్వా మి వారి పవిత్ర చిత్రపటాన్ని వారికి ఆత్మీ యంగా అందజేసి, వీడ్కోలు పలికాను. ఆ కాళహస్తీశ్వరుని కృపాకటాక్షాలు, ఆశీస్సు లు వారికి ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించాను.

## చెరువుల సంరక్షణ అందరి బాధ్యత : ఎంపీడీవో బాలాజి



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 19 :** చెరువుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎంపీడీఓ బాలాజీ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జల ధార జల హారతి పనుల గురించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, టెక్నికల్ అసిస్టెంట్, ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చెరువు మ్యాప్ తో సహా ప్లాన్ తయారు చేయాలని ఇంజనీర్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో ఇరిగేషన్ అసిస్టెంట్ ఇంజనీర్ లక్ష్మీనారాయణ, ఉపాధి హామీ ఏపీఓ మురుగేషన్, జూనియర్ ఇంజనీర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు. అనంతరం తుర్లపల్లి గ్రామపంచాయతీలోని చెరువులను ఎంపీడీవో బాలాజీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ మహేష్ కుమార్, కొళత్తూరు, పెదకాపల్లి పంచాయతీ పరిధిలో చెరువులను ఉపాధి హామీ ఏపీఓ మురుగేషన్ పరిశీలించారు.

# సచివాలయంలో పాము - పరుగులు తీసిన అధికారులు



**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 19 :** మండల కేంద్రమైన పెద్దపంజాణి సచివాలయం లో మంగళవారం పాము రా వడంతో అక్కడ విధులు నిర్వ హిస్తున్న కొందరు అధికారు లు భయంతో పరుగులు తీ శారు. సిబ్బంది విధులు నిర్వ హిస్తుండగా హఠాత్తుగా ఓ పా ము సచివాలయంలో ప్రవేశిం చి సిబ్బందిని భయభ్రాంతుల కు గురిచేసింది. ఐతే ధైర్యంగా వున్న సచివాలయ సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి పాముని కొట్టివేయడంతో ఊపిరి పీల్చుకున్నారు. కాగా గతంలో కూడా ఇదే సచివాలయంలో పైకప్పు పెచ్చులు ఊడి పడి సిబ్బంది గాయపడిన సంఘటన మరువక ముందే పాము సచివాలయంలోకి ప్రవేశించి హల్చల్ చేయడం గమనార్హం. పెద్దపంజాణి గ్రామ సచివాలయం నిర్మాణం పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా నూతన సచివాలయ భవనం ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.

## కోగిలేరులో ఉచిత కంటి వైద్యశిబిరం




**పెద్దపంజాణి, ఆంధ్రనాడు, మే 19 :** మండలంలోని కోగిలేరులో మంగళవారం డాక్టర్ అగర్వాల్ ఆధ్వర్యంలో జిల్లా దళిత నాయకుడు, సామాజిక సేవ కార్యకర్త చిన్న నేతృత్వంలో ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ ఆసుపత్రి సిబ్బంది, బాలరాజు, వీరాంజనేయులు, వెంకటరెడ్డి మణి, రాధ, మురుగేష్. గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్వాడి సహాయక పోస్టులకు దరఖాస్తు చేసుకోండి..

కార్వేటి నగరం – ఆంధ్ర నాడు, మే 19 : కార్వేటి నగరం ఐసిడిఎస్ కార్యాలయం పరిధిలోని అంగన్వాడీ సహాయక పోస్టులకు దరఖాస్తు నిర్వహిస్తున్నట్లు సి డిపో శోభారాణి ఒక ప్రకటనలో తెలిపారు.మండల పరిధిలోని 14 అంగన్వాడి సహాయకురాలు పోస్టులకు కొరకు ఈనెల 27 తేదీలోపల దరఖాస్తు చేసుకుని వివరాలను కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు. మరిన్ని వివరాలకు కార్యాలయంలోని అధికారులు సంప్రదించవచ్చని తెలిపారు.

# మంచి పుస్తకానికన్నా మించిన మిత్రుడు లేడు

**- ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురువారెడ్డి**



**చంద్రగిరి – ఆంధ్ర నాడు, మే 19 :** మంచి పుస్తకాని కన్నా మించిన మిత్రుడు లేడని ఉమ్మడి చిత్తూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురువా రెడ్డి అన్నారు. చంద్రగిరిలోని శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవిజ్ఞాన శిబిరాలను ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి వర్యులు నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సారథ్యంలో ప్రవేశపెట్టినటువంటి ఉచిత వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నారో అనే విషయాన్ని ఆయన పరిశీలించారు. గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలలో జరుగుతున్నటువంటి శిక్షణను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాల ద్వారా విద్యార్థులు మేధాశక్తిని పెంచుకొని పుస్తక పఠనం వైపు ఎక్కువ సమయం కేటాయించేందుకు అవకాశం కలుగుతుందన్నారు. విద్యార్థులకు ఇంగ్లీష్,తెలుగు గ్రామర్, తెలుగు పద్యాలు గేయాలు యోగ పరిశుభ్రత కంప్యూటర్ నాలెడ్జ్ జనరల్ నాలెడ్జ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తూ క్రాఫ్ట్ వర్క్ నేర్పించటం జరుగుతన్నట్లు లైబ్రేరియన్ రెడ్డమ్మ చైర్మన్ దృష్టికి తీసుకొని వచ్చారు. విద్యార్థులను మంచి మార్గంలో నడిపించేటటు వంటి ఈ వేసవి విజ్ఞాన శిబిరాలను ప్రతి విద్యార్థి కూడా వాడుకుని తమ సృజనాత్మకతను పెంపొందించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. విద్యార్థుల హాజరు పట్టిని, అదేవిధంగా గ్రంథాలయ రికార్డులను తనిఖీ చేసి విద్యార్థులను ఎక్కువమంది ఈ శిబిరాలను ఉపయోగించుకునే విధంగా చైతన్యం చేయాలని స్థానిక గ్రంథాలయ అధికారి రెడ్డమ్మకు సూచించారు అదేవిధంగా విద్యార్థులు ఆడుతున్నటువంటి ఆటలు క్యారం బోర్డ్ లాంటి వాటిని ప్రత్యేకంగా చైర్మన్ పరిశీలించారు ఈ కార్యక్రమంలో రాయల్ విక్టరీ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయురాలు యం.సుమలత, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

# అశీగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

- బైరెడ్డిపల్లి మండలంలో 4 పోస్టులు
- ఒకటి అంగన్వాడీ టీచర్, మూడు సహాయకురాలు పోస్టులు
- సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చిన ఐసిడి ఎస్ ప్రాజెక్టు అధికారిని యు. అరుణశ్రీ






**బైరెడ్డిపల్లి – ఆంధ్రనాడు, మే 19:** బైరెడ్డిపల్లి మండల ఐ సి డి ఎస్ ప్రాజెక్టు కింద నాలుగు అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం.. అర్హులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రనాడు తెలుగు దిన పత్రిక ద్వారా పిలుపునిచ్చారు. మండలంలోని గడ్డూరు, చిక్కనపల్లి, మూలతిమ్మేపల్లి, జాలరిపల్లి గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోగలరని అరుణశ్రీ పేర్కొన్నారు. అంగన్వాడీ టీచర్ ఒక పోస్ట్ గడ్డూరు గ్రామంలో ఖాళీ ఉన్నది.ఓ సి ఓపెన్ క్యాటగిరిలో ఉన్నది. వీటికి అర్హులు అదే గ్రామానికి చెంది ఉండాలి, వివాహిత అయి ఉండాలి. కచ్చితంగా 10 వ తరగతి పాస్ కావాలి. వయసు 21 పైన 35 మధ్యన కలవారు అర్హులుగా గుర్తించారు. ఇలా చెందిన వారి ఈ నెల 20 వ తేదీ నుండి 28 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

**వీకోట మండలం:**

వీకోట ఐ సి డి ఎస్ ప్రాజెక్టు పరిధిలో ఏడు అశీగన్వాడీ సహాయకురాలు పోస్టులు ఖాళీగా ఉన్నట్టు తెలిపారు. దేయాలపల్లి, పసలమంద, వీజీ తోపు, చెరువు ముందర ఊరు, యడగురికి, నాయకనేరి, దేవరాజు పురం ఈ గ్రామాల్లో ఖాళీగా ఉన్నాయి. అర్హులు పై తెలిపిన వివరాలు మేరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

# రేణిగుంటలో పుచ్చలపల్లి వర్ధంతి



**రేణిగుంట – ఆంధ్రానాడు, మే 19 :** రేణిగుంటలో ఘనంగా పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి మంగళవారం నిర్వహించారు.భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కమ్యూనిస్టు గాంధీగా పేరొందిన పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా మంగళవారం ఉదయం 10 గంటలకు ఆయన చిత్రపటానికి నారాయణ, దస్తగిరి కలిసి పూల మాల వేసి సిపిఎం కార్యకర్తలు ఘన నివాళులర్పించారు. రెడ్ సెల్యూట్ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య మీ ఆశయాలను సాధిస్తాం. అంటూ నినాదాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ మాట్లాడుతూ కామ్రేడ్ సుందరయ్య 1913, మే 1న శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, విడవలూరు మండలం, అలగానిపాడు గ్రామంలో జన్మించారు. మహాత్మా గాంధీ పిలుపు మేరకు 1930లో చదువును మధ్యలోనే వదిలి స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నారు. భారతదేశంలో కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్ట్) వ్యవస్థాపక సభ్యులలో ఒకరు. 1964 నుండి 1978 వరకు ఆ పార్టీకి మొదటి ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారు. జీవితాంతం నిరాడంబరంగా జీవించి, పేదలు, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం అవిశ్రాంతంగా పోరాడారు. స్ఫూర్తిదాయక జీవితంసుందరయ్య ప్రజల మనిషిగా, సమసమాజ స్థాపన కోసం తన ఆస్తిపాస్తులను సైతం త్యజించి ప్రజల కోసం అంకితమైన మహనీయుడు. ఆయన చేసిన త్యాగాలు మరియు పాటించిన విలువలు నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం అన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఐదు మంది కొత్త కార్యకర్తలకు ఆక్సిలరీ నుండి క్యాండిడేట్ సభ్యత్వం ను భారతి, సులోచన, పద్మమ్మ, నారాయణ, దస్తగిరి లకు ఇవ్వడం జరిగిందని పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట టౌన్ సిపిఎం పార్టీ కార్యదర్శి కె.ఈశ్వరమ్మ, భారతి, సులోచన, లక్ష్మమ్మ, పద్మమ్మ, మహాలక్ష్మమ్మ, నారాయణ, దస్తగిరి, ప్రాంతీయ కమిటీ కన్వీనర్ కొండ్రెడ్డి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠ్య పుస్తకాలు లెక్కను సరి చేసుకొంటున్న ఎంఇఓ సుబ్రమణ్యం



**బైరెడ్డిపల్లి – ఆంధ్రనాడు, మే 19:** విద్యా సంవత్సరం ప్రారంభం కాక మునుపే మండలంలోకి నూతన పాఠ్య పుస్తకాలు వచ్చేశాయ్. పిల్లలు తరగతి గదిలోకి అడుగు పెట్టిన వెంటనే పుస్తకాలు అందించాలనే ముందు చూపు ధోరణితో రాష్ట్ర వ్యాప్తంగా ఆయా మండలాలకు పంపిణీ చేసేశారు సంబంధిత అధికారులు. ఇదే క్రమశీలోనే బైరెడ్డిపల్లి మండలానికి కూడా రావడం జరిగింది. బైరెడ్డిపల్లి బాలురు పాటశాలలోకి వచ్చిన పాఠ్య పుస్తకాల సంఖ్యను స్థానిక ఎంఇఓ సుబ్రమణ్యం, సిఆర్‌పీలు ఆధ్వర్యంలో హమాలీల సహకారంతో చక్కపెట్టి క్రమం మంగళవారం చేశారు. ఈ సందర్భంగా ఎంఇఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాటశాలలకు నూతన పాఠ్య పుస్తకాలు జిల్లా యంత్రాగం నుండి రావడం జరిగింది. వారు పంపిన సంఖ్య సరి చూసే క్రమశీ హమాలీలు సాయంతో చేశాం. వారు పంపిన సంఖ్యను మంగళవారం చూశాం. లోటు ఉంటే పై స్థాయికి వివరాలు పంపి కొత్త విద్యా సంవత్సరానికి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు లోటు లేకుండా చూస్తామని మంగళవారం ఎంఇఓ ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడు రామచంద్రప్ప మాట్లాడుతూ విద్యార్థులకు ప్రభుత్వం నుండి వచ్చిన విద్యా సామగ్రిని దగ్గరుండి సరి చూసిన సిఆర్‌పిలకు, హమాలీలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఓ సుబ్రమణ్యం, సిఆర్‌పీలు, హమాలీలు పాల్గొన్నారు.

# రేణిగుంటలో డ్రగ్స్ పై దండయాత్ర



**రేణిగుంట – ఆంధ్రనాడు, మే 19 :** రేణిగుంట ఎన్టీఆర్ సర్కిల్ ఆవరణంలో డ్రగ్స్ పై దండయాత్ర కార్యక్రమాన్ని రేణిగుంట అర్బన్ పోలీసులు మంగళవారం నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో గంజాయి విక్రేతలు, వినియోగదారుల కదలికలపై నిఘా ఉంచామని రేణిగుంట డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. డ్రగ్స్ పై దండయాత్ర 2.0 కార్యక్రమంలో భాగంగా మంగళవారం రేణిగుంటలో గంజాయి అలవాటు ఉన్న అనుమానితులకు ప్రత్యేక కిట్ల ద్వారా పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ గతంలో గంజాయి కేసుల్లో నిందితులుగా ఉన్నవారు, గంజాయి విక్రయించే పెడ్లర్స్, అలాగే వినియోగదారుల కన్స్యూమర్స వివరాలను సేకరించి, వారిని పిలిపించి ఎన్టీఆర్ కూడలి వద్ద'బయో–చెక్' కిట్ల ద్వారా పరీక్షలు చేస్తున్నట్లు వెల్లడించారు. అనుమానితుల నుంచి సేకరించిన నమూనాలను ఈ కిట్ ద్వారా పరీక్షించి గంజాయి వాడుతున్నారా లేదా అనేది నిర్ధారిస్తారు.ఈ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన వారి ద్వారా గంజాయి నెట్‌వర్క్‌కు సంబంధించిన ఫార్వర్డ్, బ్యాక్ వర్డ్ లింకులను ఐడెంటిఫై చేసి అదుపులోకి తీసుకుంటామన్నారు.గంజాయికి బానిసలైన వారిని ఆ అలవాటు నుంచి దూరం చేసేందుకు వారి తల్లిదండ్రుల అంగీకారంతో కౌన్సిలింగ్ ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ జయ చంద్ర, సబ్ ఇన్స్పెక్టర్ ధర్మారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నలుగురు పేకాట రాయుళ్ళు అరెస్టు..

**- రూ. 20,210 నగదు, 2ద్విచక్ర వాహనాలు స్వాధీనం**



**తంబళ్లపల్లి - ఆంధ్రనాడు, మే 19:** పేకాట స్థావరంపై దాడులు చేసి నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ అనిల్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కోసువారిపల్లెకు సమీపంలోని అటవీ సమీప ప్రాంతంలో పేకాట ఆడుతున్నారన్న రహస్య సమాచారంతో సోమవారం రాత్రి సిబ్బందితో కలసి దాడులు చేసినట్టు తెలిపారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతూ నలుగురు పట్టుబడ్డారన్నారు. నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 20,210 నగదు, రెండు సెల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.నలుగురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచనున్నట్టు తెలిపారు. పేకాట ఆడడం, జూదం, బెట్టింగ్, మద్యం అక్రమ రవాణా, డ్రగ్స్, మత్తు పదార్థాలు సేవించడం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం చట్ట రీత్యా నేరమన్నారు. తమ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

# మల్లవరంలో కిషోరి వికాసం



**రేణిగుంట - ఆంధ్రనాడు, మే 19 :** రేణిగుంట మండలం మల్లవరం గ్రామంలో ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ , రాస్ ఐసిడిఎస్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కిషోర్ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐ సి డి ఎస్ అధికారిని కృష్ణవేణి మాట్లాడుతూ కిషోరి బాలికల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వేసవి సెలవుల్లో కిషోరి వికాసం కార్యక్రమం అమలు చేయడం జరిగింది. అని తెలియజేసారు. ఈ కార్యక్రమం లో పిల్లలకి విద్య యొక్క ప్రాముఖ్యత, పోక్సో చట్టశీ, ఆర్థిక సాధికారత, బాల్య వివాహం, పోషకాహారం, పరుశుభ్రత, జీవన నైపుణ్యాలు మొదలగు అంశాలపై దసలవారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది అని తెలియజేసారు. సెలవుల్లో ఈ అవకాశాన్ని పిల్లలు ఉపయోగించుకొని సమావేశాలకు హాజరై సమాచారాన్ని తెలుసుకొని గ్రామం లోని అందరి కిషోరి బాలబాలికలకు వివరించాలని తెలియజేసారు. ప్రతి మంగళవారం కూడా గ్రామ స్థాయిలో కిషోరి బాలబాలికలకు సమావేశం ఏర్పాటు చేసి ఒక్కో అంశం పైన వివరం గా శిక్షణ అందించడం జరుగుతుందని తెలియజేసారు.

# తాగు నీటి సమస్య పరిష్కరించండి



**తంబళ్లపల్లి - ఆంధ్రనాడు, మే 19:** తంబళ్లపల్లి మండలం ఎద్దులవారిపల్లి పంచాయతీ దిగువ గాలి గుత్తపల్లిలో తాగు నీటి సమస్య వేదిస్తోంది.గ్రామంలో సుమారు 30కుటుంబాలు జీవిస్తుండగా 150మంది వరకూ జనాభా ఉన్నారు. నెల రోజుల క్రితం పల్లెకు నీటిని సరఫరా చేసే మోటారు చెడిపోయింది. విషయాన్ని పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల క్రితం తాత్కాలిక మోటారు ఏర్పాటు చేసారని.. అది ఆన్ చేయగానే మారమ్మత్తులకు గురైందని గ్రామస్తులు తెలిపారు. అప్పటి నుంచి సమస్యను పట్టించుకోలేదని వాపోయారు. దీంతో చేసేది లేక పల్లెలో వున్న చేద బావిలో కష్టాలు పడుతూ నీటిని తోడుకుని నిత్యావసరాలకు వాడుకుంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.పల్లెలో వృద్ధులు అధికంగా వున్నారని ఉన్నతధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

# రెవెన్యూ లక్ష్యాలపై సీసీఎల్ఏ దిశానిర్దేశం

**- 22ఏ, వెబ్‌ల్యాండ్, రీ సర్వే పనుల్లో వేగం పెంచాలని ఆదేశాలు**



**తిరుపతి కలెక్టరేట్ - ఆంధ్రనాడు, మే 19:** రాష్ట్రంలో భూపరిపాలన, రెవెన్యూ శాఖల పరిధిలో చేపడుతున్న వివిధ కార్యక్రమాల పురోగతిపై ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్ఏ), రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (స్పెషల్ సీఎస్) జి. జయలక్ష్మి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర సచివాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి నిర్వహించిన ఈ సమీక్షలో 22ఏ, వెబ్‌ల్యాండ్, పట్టాదారు పాస్‌బుక్స్ పంపిణీ, రీ సర్వే, మాన్యువల్ రెవెన్యూ రికార్డుల డిజిటలైజేషన్ వంటి కీలక అంశాలపై జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో చర్చించారు. వివిధ పనుల పురోగతిని సవివరంగా పరిశీలించిన సీసీఎల్ఏ జయలక్ష్మి, నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల్లో పనుల్లో వేగం పెంచి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. తిరుపతి జిల్లా నుంచి జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు, తిరుపతి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఆర్డీఓలు రామ్మోహన్, భానుప్రకాష్ రెడ్డి, దేవేంద్ర రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు భరత్ నాయక్, రోజ్‌మాండ్, ల్యాండ్ అండ్ సర్వే అధికారి అరుణ్ కుమార్‌తో పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

# జలధార-జలహారతి పనులు వేగవంతం చేయాలి

**- జిల్లాలో నీటి సంరక్షణ కార్యక్రమాలపై సమన్వయంగా చర్యలు తప్పనిసరి**
**- సమీక్షలో జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ ఆదేశం**



**తిరుపతి కలెక్టరేట్ - ఆంధ్రనాడు, మే 19 :** జలధార-జలహారతి కార్యక్రమం కింద చేపడుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలో నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి నిల్వపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా స్థాయి అధికారులు, అలాగే మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఇరిగేషన్ సిబ్బంది, ఏపీవోలు, డ్వామా, హార్టికల్చర్, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి గ్రామంలో నీటి వనరులను గుర్తించి వాటి సంరక్షణకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. చెరువులు, కుంటలు, కాలువల పునరుద్ధరణతో పాటు వర్షపు నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో ఇప్పటివరకు జలధార--జలహారతి కార్యక్రమం ద్వారా 4,143 పనులు గుర్తించగా, వాటిలో 3,376 పనులకు అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. వీటిలో 1,536 పనులు ప్రారంభించబడ్డాయని, ఇప్పటివరకు 27 పనులు పూర్తయ్యాయని అధికారులు వివరించారు. మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి నీటి బొట్టును కాపాడటం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రతను అందించగలం అని కలెక్టర్ పేర్కొన్నారు. నీటి వృథాను నివారించడంతో పాటు వర్షపు నీటిని నిల్వ చేసే చర్యలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. జలధార-జలహారతి కార్యక్రమంలో భాగంగా చెరువుల పూడిక తొలగింపు, కాలువల శుభ్రత, ఇంకుడు గుంతల నిర్మాణం, వర్షపు నీటి నిల్వ నిర్మాణాలు, పంట పొలాల్లో నీటి సంరక్షణ చర్యలను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. గ్రామస్థాయిలో నీటి సంఘాలను చురుకుగా పనిచేసేలా చేయాలని, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి శాఖ సమన్వయంతో పనిచేస్తేనే నీటి వనరుల సంరక్షణ లక్ష్యాలు సాధ్యమవుతాయని ఆయన స్పష్టం చేశారు. పనుల అమలులో నిర్లక్ష్యం లేకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని, పురోగతిపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమీక్షలో డ్వామా పీడీ ఏంసి. మద్దిలేటి, ఇరిగేషన్ ఎస్ఈ. రాధాకృష్ణ, ఏపీవోలు తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఎండ వానల నుండి ప్రజల రక్షణే లక్ష్యంగా

**- తోపుడు బండ్ల చిరు వ్యాపారులకు టార్ బాలిన్ పట్టలు**
**- టిడిపి రాజంపేట పార్లమెంటరీ సెక్రెటరీ పర్వీన్ తాజ్**



**పుంగనూరు - ఆంధ్రనాడు, మే 19:** పుంగనూరు పటణంలోని తోపుడు బండ్ల చిరు వ్యాపారులు, ఎండలకు వానలకు వారి వ్యాపారం నష్టం కలగకుండా ఉండేందుకు, రాజంపేట పార్లమెంటరీ తెలుగుదేశం పార్టీ సెక్రెటరీ పర్వీన్ తాజ్ మరియు వారి బృందం, తార్పాలిన్ పట్టలు పంపిణీ చేశారు, ఈ సందర్భంగా పర్వీన్ తాజ్ మాట్లాడుతూ మా పుంగునూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా రామచంద్రారెడ్డి గారు, మానవతా దృక్పథంతో, తోపుడు బండ్ల వ్యాపారస్తులు ఎండకు వర్షాలకు వాళ్ళు ఇబ్బందులు పడకుండా వారి వ్యాపారం చేసుకోవడానికి ఇబ్బంది కలగకుండా ఏదో చేయాలని ఆయన మంచి ఉద్దేశం ఆదేశించడం జరిగిందని ఆయన ఆదేశాల మేరకు నాతో పాటు షామీర్ లాల్, సద్దాం హుస్సేన్, మేము కలసి, వారికి తార్పాలెం పట్టలను పంపిణీ చేసనందుకు మాకు ఎంతో సంతోషంగా ఉందని, ఇలాంటి కార్యక్రమాలను చేయడానికి మా బృందం ఎప్పుడూ ముందుంటుందని, మా నాయకుడు ఆదేశాలు మేరకు కచ్చితంగా మేము ప్రజల కోసం ఏం చేయడానికి అయినా సిద్ధంగా ఉన్నామన్నారు, ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వ నాయకులు, నూరుల్లా, ముజాహిద్, మౌలా, ఇర్ఫాన్, నూరుల్లా కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు

# మంచి ప్రజా పాలనకు కట్టుబడి పని చేయాలి...

**- తిరుపతి నియోజకవర్గం పరిస్థితులను నారా లోకేష్‌కు వివరించిన డాక్టర్ 'కోడూరు'**



**తిరుపతి, మే 19, (ఆంధ్రనాడు):** తిరుపతి నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై దృష్టి సారించి మంచి ప్రజా పాలనకు కట్టుబడి పని చేయాలని తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం కు సూచించారు. మంగళవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి నారా లోకేష్‌ను టిడిపి మాజీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం మర్యాదపూర్వకంగా కలిసి తిరుపతి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులను క్షుణ్ణంగా మంత్రి లోకేష్ కు వివరించారు. తిరుపతి నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, నిధులు, ప్రజలు ప్రధానంగా ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా నారా లోకేష్‌కు వివరించారు. తిరుపతి నియోజకవర్గంలో రోజురోజుకు మారుతున్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రజల్లో ఆయోమయ పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మరింత చురుకుదనం లోతైన అవగాహనతో ముందుకు సాగాలని డాక్టర్ బాలసుబ్రమణ్యంకు నారా లోకేష్ సూచించారు. క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై లోతుగా అధ్యయనం చేసి వేగవంతమైన పరిష్కారాల ద్వారా మంచి పాలన అందించాల్సిన బాధ్యత ప్రతి తెలుగుదేశం పార్టీ నాయకుడి పై ఉందని మంత్రి లోకేష్ సూచించారు. ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవడం కోసం బూత్ లెవెల్‌లో నిరంతరంగా పని చేయాలని మంత్రి లోకేష్ చెప్పినట్లు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం మీడియాకు తెలిపారు. ఇవాళ తరబడి పరిష్కారం కానీ శెట్టిపల్లి వాసుల భూ సమస్య పరిష్కారం తోపాటు తిరుపతి నియోజకవర్గం పెట్టుబడులను ఆకర్షించేందుకు తీసుకుం టున్న చర్యలు అభివృద్ధి పట్ల చెబుతున్న దృష్టికి నారా లోకేష్‌కు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం ప్రత్యేక కృత జ్ఞతలు తెలిపారు. రెండో తరం రాజకీయ నాయకునిగా పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధత అచంచలమని ప్రజాసేవ తన లక్ష్యమని స్పష్టం చేశారని డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం తెలిపారు.

# చైతన్య సేవాసంస్థకు వంటపాత్ర బహుకరణ

**- శ్రీ వెంకటసాయి అన్నదాన సేవా ట్రస్ట్ దాతృత్వం**






**మదనపల్లి - ఆంధ్రనాడు, మే 19:** పట్టణంలోని దేవత నగర్‌లో ఉన్న చైతన్య స్వచ్ఛంద సేవా సంసకు శ్రీ వెంకటసాయి అన్నదాన సేవా ట్రస్ట్ సభ్యులు వంటపాత్రను బహుకరించారు. డ్రగ్ ఇన్స్పెక్టర్ కేశవరెడ్డి సూచనల మేరకు ట్రస్ట్ ప్రతినిధులు పి. సుధాకర్, అంజద్ బాషా, ఏ.వి. ప్రసాద్, కిరణ్ కుమార్ మంగళవారం సంస్థను సందర్శించి, చిన్నారులు మరియు వృద్ధాశ్రమంలోని వృద్ధుల కోసం 15 కేజీల సామర్థ్యంతో కూడిన వంటపాత్రను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ జనరల్ సెక్రటరీ ఏ. కవితా రాణి, అడ్మిన్ డైరెక్టర్ డా. జి. సుబ్రహ్మణ్యం బాబు మాట్లాడుతూ కేశవరెడ్డి బృందం సంస్థకు ఎన్నో సంవత్సరాలుగా తోడ్పాటును అందిస్తూ సేవా కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ట్రస్ట్ సహకారం పట్ల కృతజ్ఞతలు తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ ఇలాంటి సహాయం కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం ట్రస్ట్ అధ్యక్షుడు సుధాకర్‌కు జ్ఞాపికను అందజేశారు.

# తుడా చైర్మన్‌కి డాక్టరేట్ ప్రధానం: ఎస్వీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్



**తిరుపతి - ఆంధ్రనాడు, మే 19:** శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగానికి చెందిన పరిశోధక విద్యార్థి,తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డి కి పిహెచ్.డి డిగ్రీ ప్రధానం చేసినట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా బి. రాజమాణిక్యం ఒక అధికారిక ప్రకటనలో తెలిపారు.ఆర్థిక శాస్త్ర విభాగానికి చెందిన ప్రముఖ ఆచార్యులు ప్రొఫెసర్ జి. సవరయ్య పర్యవేక్షణలో అలాగే కో-రీసెర్చ్ సూపర్వైజర్ ప్రొఫెసర్ ఆర్. సునీత మార్గదర్శకత్వంలో డా. డాలర్స్ దివాకర్ రెడ్డి తన పరిశోధనను పూర్తి చేశారు. కౌలు రైతుల ఆర్థిక పరిస్థితులు: చిత్తూరు జిల్లాలో ఒక కేస్ స్టడీ" (ఎకనామిక్ కండిషన్స్ అఫ్ టెనంట్ ఫార్మర్స్ : ఏ కేస్ స్టడీ ఇన్ చిత్తూర్ డిస్ట్రిక్ట్ ) అనే సామాజిక ప్రాధాన్యత కలిగిన అంశంపై ఆయన సుదీర్ఘ పరిశోధన చేసి, రూపొందించిన పరిశోధన గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించిన ట్లు కంట్రోలర్ వివరించారు.పరిశోధనలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా క్షేత్రస్థాయిలో సుమారు 312 మంది కౌలు రైతుల కుటుంబాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను, వారు ఎదుర్కొంటున్న సవాళ్లను డా.దివాకర్ రెడ్డి నిశితంగా విశ్లేషించారు. వ్యవసాయ రంగంలో కౌలు రైతుల పెట్టుబడులు, అప్పుల భారం, ప్రభుత్వ పథకాల లబ్ధి తదితర అంశాలను శాస్త్రీయంగా తన గ్రంథంలో పొందు పరిచారు.తన పరిశోధనా కాలంలో రాసిన పలు అత్యుత్తమ పరిశోధనా పత్రాలు ప్రతి ష్టాత్మక జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్ లో ప్రచురితమయ్యాయి.రాజకీయ, సామాజిక పదవుల్లో తీరిక లేకుండా ఉంటూనే, సమాజానికి ఉపయోగపడే కౌలు రైతుల అంశంపై డాక్టరేట్ సాధించడం పట్ల వర్సిటీలో హర్షం వ్యక్తమవుతోంది.

# గంగమ్మ తల్లిని దర్శించుకున్న రెవిన్యూ శాఖ మంత్రి



**తిరుపతి – ఆంధ్రనాడు, మే 19:** తిరుపతి ప్రజల ఆరాధ్య దైవం, కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సోదరి అయిన శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లిని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రి అనగాని సత్యప్రసాద్, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డిలకు గంగమ్మ దేవస్థానం ఛైర్మన్ మహేష్ యాదవ్ మరియు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం మంత్రి అనగాని సత్యప్రసాద్, తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డికి దేవస్థానం ఛైర్మన్ మహేష్ యాదవ్ గజమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం వారు అమ్మవారి మూలవిరాట్టును దర్శించుకుని, ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో విలసిల్లాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి రాష్ట్రం సస్యశ్యామలం కావాలని అమ్మవారిని ప్రార్థించారు. దర్శనానంతరం ఆలయ మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం పలికారు. ఛైర్మన్ మహేష్ యాదవ్ వారికి అమ్మవారి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అమ్మవారి పవిత్ర ప్రతిమను బహుకరించి గౌరవించారు. ఈ కార్యక్రమంలో కూటమి రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ యాదవ్ తెదేపా తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు పనబాక లక్ష్మి, శ్రీధర్ వర్మ, పులిగోరు మురళి కృష్ణ,జిల్లా నాయకులు,దేవస్థానం బోర్డు సభ్యులు, ఆలయ అధికారులు, అర్చకులు మరియు భక్తులు పాల్గొన్నారు.

# నాయకులు, కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లాలి



**చిత్తూరు, మే19, ఆంధ్రనాడు:** డివిజన్ స్థాయిలో ఇన్చార్జులు, తెదేపా ప్రధాన, అనుబంధ కమిటీల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు.. సమన్వయంతో ప్రజల వద్దకు వెళ్లాలని, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల గురించి వివరించి చెప్పాలని ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం లక్ష్మీ నగర్ కాలనీలోని ఎమ్మెల్యే వారి కార్యాలయం ప్రజాదర్బార్ లో నగరపాలక పరిధిలోని తొమ్మిదవ క్లస్టర్ పరిధిలోని. ఐదు డివిజన్లకు సంబంధించిన ఇన్చార్జులు, వివిధ కమిటీల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో ఇవ్వలేనంతగా రూ.నాలుగు.వేలు పింఛను అందిస్తున్నామని .. ప్రతినెలా ఒకటవ. తేదీన నాయకులు, కమిటీల సభ్యులు, కార్యకర్తలు పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రధానంగా చిత్తూరు నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సామాజిక మాధ్యమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. డివిజన్ల వారీగా కమిటీల సభ్యులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి ఏం చర్యలు తీసుకోవాలో చర్చించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బీఎన్ రాజసింహులు, అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్, క్లస్టర్, డివిజన్ ఇన్చార్జులు, నాయకులు పాల్గొన్నారు.

# గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



**చిత్తూరు, మే19, ఆంధ్రనాడు :** చిత్తూరు నగరంలో జరిగిన గంగమ్మ జాతర పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొన్నారు. మంగళవారం ఉదయం 11వ వార్డు 3వ రైల్వే గేటు వద్ద ప్రతిష్టించిన గంగమ్మ తల్లిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ఎమ్మెల్యే గారికి స్థానిక నాయకులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సాంబయ్య కండ్రిగలో జరుగుతున్న గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎమ్మెల్యే గారికి స్థానిక నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే నాయకులతో కలిసి గంగమ్మకు హారతి ఇచ్చి పూజల నిర్వహించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు వసంత్ కుమార్, రాజేష్ కుమార్ రెడ్డి, స్థానిక నాయకులు పాల్గొన్నారు

# వేట నిషేధ కాల ఉపశమనానికి "మత్స్యకార సేవలో" పథకం

- మత్స్యకారులకు రూ.20 వేల సాయం..
- డిబిటి ద్వారా నేరుగా జమ
- మంత్రి అనగాని సత్యప్రసాద్
- మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వ భరోసా
- జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్
- సరిహద్దు భద్రతకు కఠిన గస్తీ చర్యలు..
- హైస్పీడ్ బోట్లు, మెరైన్ పోలీస్ బలోపేతం
- ఎస్ ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు





**తిరుపతి కలెక్టరేట్ – ఆంధ్రనాడు, మే 19:** మత్స్యకార సేవలో పథకం కింద చేపల వేట నిషేధ కాలంలో జీవనోపాధి కోల్పోయే మత్స్యకార కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20వేల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నెల్లూరు జిల్లా, కావలి మండలం, తుమ్మలపెంట గ్రామం నుండి "మత్స్యకార సేవలో" కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించగా, తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా యంత్రాంగం వర్చువల్‌గా పాల్గొని కార్యక్రమాన్ని వీక్షించింది. ఈ సందర్భంగా 2026–27 సంవత్సరానికి సంబంధించి తిరుపతి జిల్లాలోని 3,099 మంది అర్హులైన మత్స్యకారులకు మొత్తం రూ.6.19 కోట్లు డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డిబిటి) ద్వారా నేరుగా బ్యాంకు ఖాతాల్లో జమ అవుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి



అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, 61 రోజుల సముద్ర వేట నిషేధ కాలాన్ని ప్రతి సంవత్సరం ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు అమలు చేస్తూ, ఈ కాలంలో జీవనోపాధి కోల్పోయే కుటుంబాలకు రూ.20వేలు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. వాకాడు, సూళ్లూరుపేట, తడ మండలాల్లో నిర్వహించిన బోట్ల లెక్కింపులో 650 బోట్లు, 3,453 సిబ్బంది గుర్తించబడ్డారని, జీఎస్ డబ్ల్యూఎస్ ద్వారా ఆరు దశల ధృవీకరణ అనంతరం 3,099 మంది అర్హులుగా తేలినట్లు తెలిపారు. అదేవిధంగా లబ్ధిదారులను ఏ విధంగా గుర్తించారు. గతంలో పరికరాల సబ్సిడీ, పెంచిన ఆర్థిక సహాయం, అలాగే మత్స్యకారుల హక్కుల పరిరక్షణ కోసం తీసుకున్న చర్యలను కూడా మంత్రి వివరించారు. జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ మాట్లాడుతూ, మత్స్యకారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండో సంవత్సరం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. వేట నిషేధ కాలంలో ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. అర్హుల ఎంపికను పారదర్శకంగా నిర్వహిస్తూ ఆర్బికేస్, జీఎస్ డబ్ల్యూఎస్ కేంద్రాల్లో జాబితాలు ప్రదర్శించామని, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేశామని తెలిపారు. తమిళనాడు సరిహద్దు అక్రమ బోట్ల నియంత్రణకు హైస్పీడ్ బోట్లు మంజూరు చేయడంతో పాటు తీర ప్రాంత భద్రతను మరింత బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బారాయుడు మాట్లాడుతూ, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లో సమన్వయ సమావేశాలు నిర్వహించి గస్తీ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. మెరైన్ పోలీసులతో పాటు స్థానిక మత్స్యకారుల సహకారంతో రెండు షిఫ్ట్‌ల్లో పటిష్ట గస్తీ నిర్వహణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. చట్టవ్యతిరేక బోట్లపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ., రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారులతో ప్రత్యేక అనుబంధం కలిగి ఉందన్నారు. తూపిలిపాలెంలో ఫిష్ ల్యాండింగ్ సెంటర్‌కు నిధులు మంజూరయ్యాయని, పూడిక తొలగింపు పనులకు త్వరలో చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. తన నియోజకవర్గంలో 2,270 మత్స్యకార కుటుంబాలు ఉన్నాయని, రూ.4.52 కోట్లకు పైగా భరోసా నిధులు వారి ఖాతాల్లో జమ అవుతున్నాయని తెలిపారు. ఇతర రాష్ట్రాల మత్స్యకారుల అక్రమ ప్రవేశాలను అరికట్టేందుకు వాకాడులో పోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. చంద్రగిరి, తిరుపతి, వెంకటగిరి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట ఎంఎల్ఏలు పులివర్తి నాని, ఆరని శ్రీనివాసులు, కురుగొండ్ల రామకృష్ణ, బొజ్జల సుధీర్ రెడ్డి, కోనేటి ఆదిమూలం, నెలవెల విజయశ్రీ, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి ఈ సందర్భంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో హస్తకళల చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, రెడ్ క్రాస్ చైర్మన్ డా.శ్రీహరి, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సి.ఆర్.రాజన్, జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, జిల్లా మత్స్యశాఖ అధికారి రాజేష్, మత్స్యకార శాఖ అధికారులు, మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.

# వార్డుల పునర్విభజనపై మాజీ కౌన్సిలర్లతో వైఎస్సార్సీపీ సమావేశం

- హాజరైన సమాన్వయకర్త నిస్సార్ అహ్మద్,అనూషా రెడ్డి



**మదనపల్లి – ఆంధ్రనాడు, మే 19:** పట్టణంలో మునిసిపల్ వార్డుల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి మునిసిపల్ అధికారులు ఇటీవల విడుదల చేసిన వార్డుల జాబితా పై అభ్యంతరాలను అధికారులకు సమర్పించేందుకు అవసరమైన సూచనలు, అభిప్రాయాలను సేకరించుటకై మదనపల్లి నియోజకవర్గ వైఎస్సార్సీపీ సమన్వయకర్త ఎస్. నిసార్ అహమద్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొని వార్డుల పునర్వ్యవస్థీకరణలో ప్రజల అభిప్రాయాలు, భౌగోళిక పరిస్థితులు,జనాభా ఆధారిత అంశాలు సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరాన్ని చర్చించారు. ప్రజలకు అన్యాయం జరిగే విధంగా ఉన్న ప్రతిపాదనలపై అభ్యంతరాలను సమగ్రంగా సిద్ధం చేసి మునిసిపల్ అధికారులకు అందజేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నిసార్ అహ్మమద్ మాట్లాడుతూ వార్డుల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో జరగాలని పేర్కొన్నారు. సమస్యాత్మక విభజిత వార్డుల ప్రతిపాదిత అభ్యంతరాలను ఆయా వార్డుల నాయకులు, మాజీ కౌన్సిలర్లు వ్యక్తిగతంగా అధికారులకు సమర్పించి మరియు పార్టీచే ఏర్పాటు చేసిన కమిటీకి సమర్పించాలని 23వ తేదీలోగా అన్ని వార్డుల అభ్యంతరాలను క్రోడీకరించి నివేదికను రూపొందించి అధికారులకు సకాలంలో అందజేయాలన్నారు. ఒకవేళ ఏదైనా వార్డు నుండి అభ్యంతరాలు వ్యక్తం చేయకపోతే, అధికారులు రూపొందించిన నివేదికను అంగీకరించినట్లుగా భావించాల్సి ఉంటుందన్నారు. ఈ విషయమై ఎలాంటి సందేహాలు ఉన్నా, పార్టీ నియమిత కమిటీని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పరిశీలకురాలు ఎన్. అనూషా రెడ్డి, మాజీ చైర్ పర్సన్ మనుజా రెడ్డి, వైస్ చైర్మన్ జింకా చలపతి, పూతలపట్టు నియోజకవర్గ వైకాపా పరిశీలకులు బాబ్ జాన్, మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్ రెడ్డి, రాష్ట్ర మైనారిటీ విభాగం కార్యదర్శి ఎస్.



ఏ కరీముల్లా, మాజీ కౌన్సిలర్లు, పాల్ చంద్రశేఖర్, ఈశ్వర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# గుడిపాల మండలంల.. గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్



గుడిపాల / చిత్తూరు, మే 19, ఆంధ్రనాడు: గుడిపాల మండలంలో మొగరాల పల్లి, కొత్తకోట గ్రామాల్లో మంగళవారం జరిగిన గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ పాల్గొన్నారు. మొగరాలపల్లి గ్రామంలో శ్రీ చింతలగూడి గంగమ్మ జాతరకు వెళ్లిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు, స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. సందర్భంగా ఎమ్మెల్యే గంగమ్మకు సారె సమర్పించి, హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్తులు, స్థానిక నేతలు ఘనంగా సత్కరించి అమ్మవారి విగ్రహాన్ని బహుమతిగా అందించారు. అనంతరం ఎమ్మెల్యే కొత్తకోట గ్రామంలో శ్రీ విరూపాక్ష అమ్మవారి జాతరలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే గారి ఎమ్మెల్యేకు స్థానిక కూటమి నాయకులు, గ్రామస్తులు మేళతాళాలతో స్వాగతం పలికారు. అమ్మవారికి సారె సమర్పించి, పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల హరి, తెదేపా ఉపాధ్యక్షుడు బాలసుబ్రమణ్యం యాదవ్, రాజేష్ కుమార్ రెడ్డి, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అసాంఘిక శక్తులను ప్రోత్సహిస్తున్న భూమన : రాగల ఆనంద గౌడ్



**తిరుపతి – ఆంధ్రనాడు, మే 19:** ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో నిత్యం అలజడులు, ఆశాంతి సృష్టించడమే భూమన అభినయ్ కి నిత్య కృత్యమైనదని ఆశాంఘిక శక్తులను ప్రోత్సహిస్తూ వారిచే గంజాయి అమ్మించే స్థాయికి దిగజారిన భూమన కుటుంబానికి ఏ విలువలు లేవని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనంద్ గౌడ్ ఓ ప్రక టనలో తెలిపారు.. నిత్యం నీతులు, ప్రవచనాలు చెప్పే అబ్బా, కొడుకుల గత చరిత మొత్తం చాలా హీనమైనదన్నారు. తిరుపతి మున్సిపల్ ఎన్నికల్లో, కోఆపరేటివ్ బ్యాం క్ ఎన్నికల్లో, పార్లమెంటు ఉప ఎన్నికల్లో వారు చేసిన అరాచకాలను తిరుపతి ప్రజలు ఇప్పటికి మర్చిపోలేదన్నారు. అభినయ రెడ్డి ఏనాడు జనం నుండి గెలిచిన వ్యక్తి కాద ని, అతనికి ప్రజా ఆమోదం లేదని, అలాంటి వ్యక్తి తిరుపతిని ఉద్ధరిస్తున్నట్టుగా తనను తాను గొప్పగా ఊహించుకుంటూ భ్రమల్లో బతుకుతున్నాడున్నారు. తండ్రి తిరుమల తిరుపతి దేవస్థానాన్ని టార్గెట్ చేస్తే కొడుకు తిరుపతి శాంతిభద్రతలను టార్గెట్ చేస్తున్నాడని ఇలాంటి కుటుంబం పవిత్రమైన తిరుపతిలో జీవించడానికి ఉండడానికి అర్హత లేదని అన్నారు ఇకనైనా భూమన కరుణాకర్ రెడ్డి ఆయన కొడుకు అభినయ రెడ్డి లు నిజం తెలుసుకొవాల న్నారు.తిరుపతి ప్రజలు వాళ్లను కోరుకోవడం లేదన్న వాస్తవాన్ని గ్రహించి భ్రమల్లో నుండి బయటకు వచ్చి బతకాలని సూచించారు.

# తిరుమలయ్యపల్లి లో రైతులకు సబ్సిడీ దాన పంపిణీ : మోహన్ మురళి




**వెదురుకుప్పం, ఆంధ్రనాడు, మే 19:** వెదురుకుప్పం మండలం తిరుమలయ్యపల్లి పశువైద్యశాలలో పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రూప సుందరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెదురుకుప్పం టిడిపి మండల అధ్యక్షులు మోహన మురళి మాట్లాడుతూ తిరుమలయ్యపల్లి పశువైద్యశాలకు సంబంధించి పశువుల దాన 25 టన్నుల దానాను రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం థామస్ మంజూరు చేయించారని తెలిపారు. ప్రభుత్వం 50% సబ్సిడీతో రైతులకు దానాన్ని అందజేయడం ఆనందదాయకమని తెలిపారు. రైతులకు సబ్సిడీ దాన ను అందజేశారు ఈ కార్యక్రమంలో రూప సుందరి, వెటర్నరీ డాక్టర్ స్వాతి,ఏఎంసి వైస్ చైర్మన్ రావెళ్ల దేవరాజుల నాయుడు, పార్లమెంట్ కార్యనిర్వహక కార్యదర్శి చంగ్రాయిరెడ్డి, సింగల్ విండో చైర్మన్ సుధాకర్ రెడ్డి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ రెడ్డి, ఏఎంసి డైరెక్టర్ వరప్రసాద్, మండల టిడిపి కార్యదర్శి మొగిలయ్య, మండల టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి చిరంజీవి నాయుడు, యూనిట్ కన్వీనర్ తిరుమలరెడ్డి, సీనియర్ నాయకులు నాగరాజు రెడ్డి, ఏఎంసి రెడ్డి, లోకనాథ్ రెడ్డి, మురళి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# మిట్స్ విద్యార్థుల పారిశ్రామిక పర్యటన




**కురబలకోట – ఆంధ్రనాడు, మే 19:** మదనపల్లి సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు పారిశ్రామిక విద్యా పర్యటన నిర్వహించారు. బి.టెక్, ఎం.టెక్ మొదటి సంవత్సరం విద్యార్థులు బెంగళూరులోని సీ–డాక్ కేంద్రాన్ని సందర్శించినట్లు వైస్ ఛాన్సలర్ డా. సి. యువరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సీ–డాక్ నాలెడ్జ్ పార్క్, ఎలక్ట్రానిక్ సిటీ క్యాంపస్‌లలో జరుగుతున్న ఆధునిక సాంకేతిక పరిశోధనలు, ప్రాజెక్టులను పరిశీలించారు. స్వదేశీ మైక్రోప్రాసెసర్ 'వేగా', క్వాంటం కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఐఓటీ, మెషిన్ లెర్నింగ్ రంగాలపై నిపుణులు అవగాహన కల్పించారు. అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ ట్రైనింగ్ స్కూల్ ద్వారా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ, అంతర్జాతీయ స్థాయి ఉద్యోగావకాశాలపై వివరించారు. ఈ పర్యటన ద్వారా విద్యార్థులు పుస్తక జ్ఞానాన్ని ప్రాక్టికల్ సాంకేతికతతో అనుసంధానించుకొని, భవిష్యత్ ఉపాధి అవకాశాలపై స్పష్టత పొందినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డా. ఆర్. నిధ్యా, టి. తంగరసన్‌తో పాటు 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# దళిత హక్కుల పరిరక్షణ కోసం పోరాడే పార్టీ టిడిపి



**తిరుపతి – ఆంధ్రనాడు, మే 19 :** గత ప్రభుత్వ పాలనలో దళితులపై జరిగిన అన్యాయాలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలను తీవ్రంగా ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ అధ్యక్షులు డాక్టర్ పనబాక లక్ష్మి ఆధ్వర్యంలో దళిత డ్రైవర్ సుబ్రహ్మణ్యంకి ఘన నివాళులర్పించారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో డాక్టర్ పనబాక లక్ష్మి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో దళితులపై జరిగిన దాడులు, వేధింపులు ప్రజాస్వామ్యానికి మచ్చతెచ్చే విధంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితుల హక్కుల పరిరక్షణ కోసం తెలుగుదేశం పార్టీ ఎల్లప్పుడూ పోరాడుతుందని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహ యాదవ్ , స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కుమారమ్మ, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చందన స్రవంతి, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ అన్నా అనిత, తిరుపతి పార్లమెంట్ వైస్ ప్రెసిడెంట్ యశ్వంత్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు చంగయ్య, రేవతి, కార్తీక్, రూపేష్ పాల్గొన్నారు.

# చందానామణికు 'డాక్టరేట్' ప్రధానం




**గంగవరం, ఆంధ్రనాడు, మే 19 :** మండలంలోని మదరథెరిసా ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్ఈ విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్ పనిచేస్తున్న చందనామణికు వెల్లూరులోని విఐటి యూనివర్శిటీ డాక్టరేట్ డిగ్రీని ప్రధానం చేసిందని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రవీంద్రబాబు వెల్లడించారు. బ్రేస్ట్ కాన్సర్ ఇమేజ్ యూసింగ్ 'డీప్ లర్నింగ్' అనే అంశంపై సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన విఐటి యూనివర్శిటీ, ఈ డాక్టరేట్ డిగ్రీని అందజేసినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. డాక్టరేట్ అందుకున్న చందానామణి కళాశాల యాజమాన్యం మరియు సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. చందానామణి ను కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రవీంద్రబాబు, చైర్మన్ సునీల్, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, డైరెక్టర్ రాజేందర్ రెడ్డి మరియు సిఎస్ఈ హెచ్ఓడి డాక్టర్ ప్రభు ఇతర విభాగాధిపతులు, అధ్యాపక బృందం అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. చందానామణి సాధించిన ఈ ఘనత కళాశాలకే గర్వకారణమని వారు కొనియాడారు.

# కలికిరి ఇస్తిమా విజయవంతం

**- ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డికి ముస్లిం నాయకుల కృతజ్ఞతలు**

**కలికిరి/పీలేరు - ఆంధ్రనాడు, మే 19:** కలికిరి సమీప ప్రాంతంలో ఇటీవల నిర్వహించిన ఇస్తిమా కార్యక్రమం పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి సహకారంతో విజయవంతంగా నిర్వహించబడినందుకు ముస్లిం ముత్తవల్లీలు, ఇమామ్లు మరియు ముస్లిం మైనార్టీ



నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు శాసనసభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇస్తిమా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు హాజరై ఆధ్యాత్మిక ప్రసంగాలు, ప్రార్థనలు మరియు సామాజిక ఐక్యతకు సంబంధించిన సందేశాలను ఆసక్తిగా విన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు, భద్రతా చర్యలు మరియు ఇతర సహకార అంశాలలో ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి విశేష శ్రద్ధ తీసుకున్నారని ముస్లిం పెద్దలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం ముత్తవల్లీలు, ఇమామ్లు మాట్లాడుతూ మత సామరస్యానికి, అన్ని వర్గాల అభివృద్ధికి ఎమ్మెల్యే కిషోర్ కుమార్ రెడ్డి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తున్నారని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్యక్రమాలకు ఆయన సహకారం కొనసాగాలని ఆకాంక్షించారు. అనంతరం ముస్లిం మైనార్టీ నాయకులు, పెద్దలు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సత్కరించి, ధన్యవాదాలు తెలియజేశారు.

# జగన్ హయాంలోనే దళితులపై విపరీతమైన దాడులు, దౌర్జన్యాలు

**- వైకాపా పాలనలో హతమైన దళితులను స్మరించుకున్న టీడీపీ నేతలు**
**- దళితుల ఓట్లతో గద్దెనెక్కి వారినే బలిగొన్న ప్రభుత్వం వైకాపా అని విమర్శలు**
**- పెట్రోల్, డీజిల్ ధరలపై వైకాపా వైఖరిపై వ్యంగ్యాస్త్రాలు**

**పలమనేరు, ఆంధ్రనాడు, మే 19 :** జగన్ పాలనలో దళితులపై దాడులు దౌర్జన్యాలు విపరీతంగా జరిగాయని ఇందుకు స్వయంగా రాజ్యసభలో కేంద్రం లెక్కలతో సహా వివరించిందని పలమనేరు తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించారు. తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో వైకాపా పాలనలో దారుణంగా హతమైన దళితుల సంస్మరణ పేరిట మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజు, పట్టణ నాయకులు గిరిబాబు, గంగవరం మండల ఎస్సీ సెల్ నాయకులు రవి తదితరులు మాట్లాడారు. వైకాపా పాలనలో దళితులను ఎంతగా ఊచ కోత కోశారో దళిత డాక్టర్ సుధాకర్, డ్రైవర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ అచ్చన్న ఘటనలే నిదర్శనమని పేర్కొన్నారు. జగన్ రెడ్డి హయాంలో దళితులపై దాడులు, హత్యలు పెరిగాయని ఆరోపించారు. గత ఐదు సంవత్సరాలలో 200 మందికి పైగా దళితులు హత్యకు గురయ్యారని పేర్కొన్నారు. దళితులపై నమోదైన కేసులు, దాడులు టీడీపీ పాలనతో పోలిస్తే వైసీపీ పాలనలో ఎక్కువయ్యాయని వివరించారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు ఇతర అవసరాలకు మళ్లించారని విమర్శించారు. దళితులకు రావాల్సిన సంక్షేమ పథకాలలో కోతలు పెట్టారని, కొన్ని ప్రాంతాల్లో దళిత అధికారులను అవమానించడం, వేధించడం జరిగిందని ఆరోపించారు. ఇక అప్పటి ప్రభుత్వంలో దళిత మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగాయన్నారు.. అనేక జిల్లాల్లో జరిగిన ఘటనలను ఉదాహరణలుగా చేర్చారు. ఎన్నికల సమయంలో మాత్రమే దళితులపై ప్రేమ చూపించి, తరువాత నిర్లక్ష్యం చేస్తున్నారని వారు విమర్శించారు. ఏదేమైనా దళితుల ఓట్లతో గద్దెనెక్కి వారినే బలుగొన్న ఏకైక ప్రభుత్వం వైకాపా అన్నారు. అదేవిధంగా పెట్రోల్, డిజిల్



ధరల పెంపుపై వైకాపా నేతలు చేసిన ధర్నాపై వారు వ్యంగ్యాస్త్రాలను సంధించారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న సమస్యను రాష్ట్ర ప్రభుత్వానికి అంటగట్టి వైకాపా ఎబ్బం గడుపుకోవాలని చూడడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రజలపై నిజంగా చిత్తశుద్ధి ఉంటే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వద్దకెళ్లి ధర్నా చేయాలని ఎందుకు తాము ప్రతిపక్షం నడుస్తామంటూ వ్యంగంగా సమాధానమిచ్చారు. ఈ మీడియా సమావేశంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం గౌడు, టీడిపి నాయకులు ఖాజా పీర్, అమానుల్లా, మా భాష, సుధాకర్, శ్రీనివాసులు, సుబ్బు , లోకేష్ ఆచారి, సురేంద్ర, చందు, మురళి తదితరులు పాల్గొన్నారు.

# అమ్మలగన్న అమ్మ గంగమ్మ ...!

**కుప్పం – ఆంధ్రనాడు, మే 19:** కోరిన భక్తుల కొంగుబంగారంగా భక్తులచే విశేష పూజలందుకుంటున్న కుప్పం గ్రామ దేవత శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతరలో భాగంగా మంగళవారం కుప్పం – పలమనేరు జాతీయ రహదారిలోని చెరువుకట్ట వద్దవున్న కోనేరు సమీపంలో వేదపండితులు విశేష పూజలు నిర్వహించి అమ్మవారి శిరస్సు తెర తొలగించారు. అంతకుముందు కోనేరు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ చైర్మన్ రవిచంద్రబాబు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తలపై పూజ సామాగ్రిని మోసుకుంటూ అమ్మవారి ఎదుట ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాలు, పలక వాయిద్యాల నడుమ అమ్మవారి శిరస్సును పట్టణంలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. పట్టణ వీధుల్లో ఊరేగిన అమ్మవారి శిరస్సుకు అడుగడుగునా భక్తులు నీరాజనం పలుకుతూ.. జంతుబలులు సమర్పిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు భక్తులు బారులు తీరారు. కుప్పం పట్టణం గంగమ్మ భక్తులతో కిక్కిరిసింది. ఉగ్రరూపంతో కుప్పం పట్టణంలో ఊరేగిన శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబకు భక్తులు భారీగా జంతుబలులు ఇచ్చి రక్తార్చిత చందనంను సమర్పించి అమ్మవారు శాంతిం చాలంటు ప్రార్థనలు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడు జాతరలో వేలసంఖ్యలో జంతుబలులు జరగ్గా.. ఆలయ ప్రాంతంతో పాటు పట్టణ పురవీధులు రక్తసిక్తమైంది. గంగజారత సందర్భంగా గంగమాంబ ఆలయంలో అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుండే భక్తులు బారులు తీరగ.. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం అమ్మవారి బలిపీఠం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన తరువాత పట్టణ పురవీధుల్లో భక్తులను ఆశీర్వదించేందుకు వెళ్లిన అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కుబడులు చెల్లిం చుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మంగళవారం గంగమ్మ శిరస్సు ఊరేగింపు కాస్త నెమ్మదిగా సాగడంతో బుధవారం ఉదయం 7 గంటలలోపు అమ్మవారి శిరస్సు ఆలయానికి చేరుకోకపోతే.. అమ్మవారి విశ్వరూప దర్శనం దాదాపు రెండు గంటలు ఆలస్యంగా మొదలవనుంది. బుధవారం ఉదయం 7.30 గంటల మధ్య కాలం యమగండం కారణంగా అమ్మవారు ఈ మధ్య కాలంలో ఆలయం వద్దకు చేరుకున్నా.. యమగండం సమయం ముగిసిన తరువాతే అమ్మవారు ఆలయంలోనికి ప్రవేశించనున్న నేపథ్యంలో 9.30 గంటల తరువాత భక్తుల ు అమ్మవారి విశ్వరూప దర్శన భాగ్యం కలగనుంది. తిరుపతి గంగమాంబ శిరస్సు ఊరేగింపు సందర్భంగా జంతుబలులు చేసే విషయంలో పోలీసులు పలు ఆంక్షలు విధించడంతో పాటు.. జంతుబలులు చేసే వారికి ప్రత్యేక గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు గంగమాంబ శిరస్సు ఊరేగింపుకు ప్రత్యేక పోలీసు భద్ర తను ఏర్పా టుచేశారు. జాతర సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ట్రాఫికను సైతం మళ్లించడం తో జాతరకు వచ్చేభక్తులు ప్రశాంతంగా అమ్మ వారిని దర్శిం చుకున్నారు. అదేవిధంగా అమ్మవారి శిరస్సు ఊరేగింపు, జంతుబలుల నేపథ్యంలో మంగళవారమే ప లువురు అమ్మవారికి పిండి దీపాలు సమర్పించగా.. మరికతమంది విచిత్ర వేషధారణలో తమ మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ విశ్వరూప దర్శనం సందర్భంగా పెద్ద సంఖ్యలో అమ్మవారి దర్శనానికి భక్తులు విచ్చేసిన నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అమ్మవారిని దర్శించుకునేందుకు ఆలయ కమిటీ, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

**నేడు శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ విశ్వరూప దర్శనం**

శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర లో భాగంగా బుధవారం అమ్మవారి విశ్వరూప దర్శనం ఉంటుందని ఆలయ పాలకవర్గ చైర్మన్ రవిచంద్రబాబు తెలిపారు. ఆలయ సరిహద్దుల వరకు మంగళవారం అమ్మవారి శిరస్సు ఊరేగింపు నిర్వహించి బుధవారం ఉదయానికి ఆలయానికి అమ్మవారు చేరుకుంటారనీ చెప్పారు. అమ్మవారి శరీర



భాగానికి శిరస్సును అలంకరించి ప్రత్యేక పూజలు చేసి వజ్రకిరీటం తో అమ్మవారి విశ్వరూప దర్శనం భక్తులకు కల్పించనున్నట్లు ఆయన తెలిపారు.

**కుప్పంలో ట్రాఫిక్ ఆంక్షలు**

శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ శిరస్సు ఊరేగింపు సందర్భంగా కుప్పం పట్టణంలో పోలీసులు ట్రాఫిక్ ను పూర్తిగా మళ్ళించారు. పట్టణంలోకి ఎలాంటి వాహనాలు అనుమతించడం లేదు. గంగమ్మ జాతర సందర్భంగా 350 మంది పోలీసులతో పట్టణంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డి.ఎస్.పి పార్థసారథి తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా, బుధవారం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ విశ్వరూప దర్శనంతో అమ్మవారి జాతర ముగియనుంది. నేడు అమ్మ వారిని దర్శించుకోనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు... కుప్పం గ్రామదేవత శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం అమ్మవారిని దర్శించుకోనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ రవిచంద్రబాబు, ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, సీఎం పిఎ మనోహర్ తెలిపారు. ముఖ్యమంత్రి బుధవారం ఉదయం శాంతిపురం మండల పరిధిలోని స్వగృహం కి చేరుకుంటారు. కుటుంబ సమేతంగా ఉదయం 10.40 గంటలకు శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ ఆలయానికి చేరుకొని తిరుమల నుంచి తీసుకువచ్చిన సారెను అమ్మవారికి సమర్పించనున్నారు.

# ముఖ్యమంత్రిచంద్రబాబుకు ఘన స్వాగతం

**- హెలిప్యాడ్‌కు చేరుకున్న ప్రజాప్రతినిధులు, కీలక నేతలు**

**పలమనేరు, ఆంధ్రనాడు, మే 19 :** కుప్పం పర్యటనకు విచ్చేస్తున్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఘన స్వాగతం పలికేందుకు హెలిప్యాడ్ సమీపానికి జిల్లా ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కూటమి నాయకులు భారీ సంఖ్యలో చేరుకున్నారు. ముఖ్యమంత్రికి సాదరంగా ఆహ్వానం పలికేందుకు హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న వారిలో పలమనేరు శాసనసభ్యులు అమరనాథ్ రెడ్డి , చిత్తూరు పార్లమెంట్ సభ్యులు దగ్గుమల్ల ప్రసాద రావు,ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ చైర్మన్ మునిరత్నం, చిత్తూరు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్ పర్సన్ కటారి హేమలత, టీటీడీ బోర్డు మెంబర్ శాంతారాం, మాజీ ఎమ్మెల్సీలు దొరబాబు , గౌనివారి శ్రీనివాసులు, చిత్తూరు జిల్లా పార్టీ



అధ్యక్షులు షణ్ముఖ రెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సునీల్ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షులు రామచంద్ర నాయుడు,వి. కోట మండల పార్టీ అధ్యక్షులు రాంబాబు, రామకుప్పం సీనియర్ నాయకులు ఆంజనేయ రెడ్డి వీరితో పాటు పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, నియోజకవర్గ స్థాయి ప్రజాప్రతినిధులు మరియు భారీ సంఖ్యలో కార్యకర్తలు హెలిప్యాడ్ పరిసర ప్రాంతాలకు చేరుకొని సీఎం చంద్రబాబు నాయుడుకి స్వాగతం పలికేందుకు వేచి ఉన్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు.

# రాజస్థాన్ బౌలర్లను ఉతికారేసిన మార్ష్, ఇంగ్లిస్..

- రాజస్థాన్ రాయల్స్‌కు 221 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించిన లక్నో
- కేవలం 4 పరుగుల తేడాతో సెంచరీ చేజార్చుకున్న మిచెల్ మార్ష్ (96)
- మెరుపు అర్ధశతకంతో రాణించిన జోష్ ఇంగ్లిస్ (60)
- తొలి వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పిన మార్ష్, ఇంగ్లిస్
- రాజస్థాన్ బౌలర్లలో రెండు వికెట్లు తీసిన యశ్ రాజ్ పంజా

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించారు. జైపూర్‌లోని సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన లక్నో, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 220 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్ (96), జోష్ ఇంగ్లిస్ (60) వీరవిహారం చేశారు.

ఇన్నింగ్స్ ఆరంభం నుంచే వీరిద్దరూ రాజస్థాన్ బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. పవర్‌ప్లేలోనే 83 పరుగులు రాబట్టి తమ ఉద్దేశాన్ని స్పష్టం చేశారు. కేవలం 29 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 60 పరుగులు చేసిన ఇంగ్లిస్.. తొలి వికెట్‌కు 109 పరుగుల భాగస్వామ్యం అందించి ఔటయ్యాడు. మరోవైపు, అద్భుతంగా బ్యాటింగ్ చేసిన మిచెల్ మార్ష్‌ను దురదృష్టం వెంటాడింది. 57 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 96 పరుగులు చేసి, సెంచరీకి కేవలం నాలుగు పరుగుల దూరంలో రనౌట్‌గా వెనుదిరిగాడు. చివర్లో కెప్టెన్ రిషభ్ పంత్ (23 బంతుల్లో 35) కూడా వేగంగా ఆడటంతో లక్నో భారీ స్కోరు సాధించింది. రాజస్థాన్ బౌలర్లలో యశ్ రాజ్ పంజా 35 పరుగులిచ్చి రెండు వికెట్లు తీయగా, జోఫ్రా ఆర్చర్ ఒక వికెట్ పడగొట్టాడు. మిగతా బౌలర్లు భారీగా పరుగులు సమర్పించుకున్నారు. ఈ మ్యాచ్‌లో గెలవాలంటే రాజస్థాన్ 221 పరుగుల కఠిన లక్ష్యాన్ని ఛేదించాల్సి ఉంది.





## ఆఫ్ఘనిస్థాన్ సిరీస్‌కు భారత జట్టు ప్రకటన..

# కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్

ఆఫ్ఘనిస్థాన్‌తో జూన్ 6 నుంచి జరగబోయే ఏకైక టెస్ట్, మూడు వన్డేల సిరీస్ కోసం బీసీసీఐ భారత జట్టును ప్రకటించింది. ఈ రెండు ఫార్మాట్లకు యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్‌గా వ్యవహరించనుండగా.. టెస్టు జట్టుకు కేఎల్ రాహుల్, వన్డే జట్టుకు శ్రేయస్ అయ్యర్ వైస్ కెప్టెన్లుగా ఎంపికయ్యారు. సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వన్డే జట్టులో చోటు దక్కించుకోగా, రోహిత్, హార్దిక్ పాండ్యాల ఎంపిక వారి ఫిట్‌నెస్ ఆధారంగానే ఖరారు కానుంది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతి లభించగా.. ఆంధ్ర క్రికెటర్ నితీశ్ కుమార్ రెడ్డితో పాటు హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్ రెండు జట్లకు ఎంపికయ్యారు. అలాగే వన్డే జట్టులోకి ప్రిన్స్ యాదవ్, టెస్ట్ జట్టులోకి మానవ్ సుతార్ కొత్తగా అరంగేట్రం చేయనున్నారు.

**వన్డే జట్టు:**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ (ఫిట్‌నెస్ ఆధారంగా), విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), కేఎల్ రాహుల్, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డి, హార్దిక్ పాండ్యా (ఫిట్‌నెస్ ఆధారంగా), ప్రిన్స్ యాదవ్, హర్ష్ దూబే, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, వాషింగ్టన్ సుందర్, గుర్నూర్ బ్రార్

**టెస్ట్ జట్టు:**

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), రిషభ్ పంత్ (వికెట్ కీపర్), సాయి సుదర్శన్, దేవదత్ పడిక్కల్, నితీశ్ కుమార్ రెడ్డి, ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, కుల్దీప్ యాదవ్, ప్రసిద్ధ్ కృష్ణ, మానవ్ సుతార్, హర్ష్ దూబే, గుర్నూర్ బ్రార్



# 'పెద్ది-లో కళింగాంధ్ర పలుకుబడి!

'గెలుపైనా, ఓటమైనా ఈ కొండకింద ఊరోడిదే అవ్వాల...' అంటున్నాడు పెద్ది. మైదానంలో ఆయన ఆట, పోరాటం దేనికోసమో తెలియాలంటే 'పెద్ది' సినిమా చూడాల్సిందే. ఇప్పటికే విడుదలైన ట్రైలర్, టీజరు, పాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. రెండు ఆటల్ని కలిపి ఆడేవాడిగా 'పెద్ది' పాత్రని ట్రైలర్ పరిచయం చేసింది. క్రికెటర్‌గా, కుస్తీ యోధుడిగా రామ్‌చరణ్ టైటిల్ పాత్రలో కనిపించిన తీరు ఆకట్టుకుంటోంది.

"మీరందరూ నేను ఆడానని అనుకుంటున్నారు. నేను పోరాడాను సారూ..." అంటూ రామ్‌చరణ్ చెప్పిన డైలాగ్ కథలోని లోతుని చాటుతోంది. రామ్‌చరణ్ హీరోగా, బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న భారీ పాన్-ఇండియా యాక్షన్, స్పోర్ట్స్ డ్రామా 'పెద్ది'. ఈ చిత్రం జూన్ 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో కళింగాంధ్ర మాండలికాన్ని ఉపయోగించారు. 1980ల నాటి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ క్రీడల నేపథ్యంలో సినిమా తెరకెక్కింది. జాన్వీ కపూర్, జగపతి బాబు, శివరాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

"ఇక్కడ ఏ కుర్రాడిని అడిగినా ఫేవరెట్ ప్లే మారుతుంది కానీ... ఫేవరెట్ ప్లేయర్ మారడం లేదు," అనే డైలాగుతో ట్రైలర్‌లో చరణ్ ఎంట్రీ ఇచ్చాడు. "ఈ కుర్రాళ్లకు పెద్ది గుళ్లో దేవుడు కాదు... గ్రౌండ్‌లో దేవుడు" అనే డైలాగ్ కూడా ఆకట్టుకుంటోంది. "ఆటే నా పొగరు", "మాటలతో కాదు... ఆటతో బరిలో గెలిచే మగతనం ఎవరికుందో రమ్మను" వంటి డైలాగులు ట్రెండింగ్‌లో ఉన్నాయి. ఉత్తరాంధ్ర యాసను ఈ సినిమా ఆద్యంతం వినియోగించారు. ప్రముఖ రచయిత చింతకింది శ్రీనివాసరావు స్క్రిప్టును ఉత్తరాంధ్ర మాండలికంతో తీర్చిదిద్దారు. గతంలో ఆయన 'ఘాటీ' చిత్రానికి కథ అందించగా, 'అరేబియా కడలి' వెబ్ సిరీస్‌కు కథ, మాటలు సమకూర్చారు.

కళింగాంధ్ర స్థానికతతో 'పెద్ది' సంభాషణలను ఆయన రంగరించిన తీరు ప్రత్యేకంగా నిలుస్తోంది. స్థానిక యాసభాషలతో వచ్చిన 'పుష్ప', 'రంగస్థలం', 'తండేల్', 'వాల్తేరు వీరయ్య' చిత్రాలు బాక్సాఫీసు వద్ద విజయాలు సాధించిన నేపథ్యంలో, 'పెద్ది'పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి.?

## బాలల చిత్రం 'సమ్మర్ హాలిడేస్'



ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై 'సమ్మర్ హాలిడేస్' అనే బాలల చిత్రం రాబోతోంది. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసే కథతో దర్శకుడు శ్రీకర్ ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మాస్టర్ రోహన్, మాస్టర్ అరుణ్, 'మన శంకర వరప్రసాద్ గారు' మూవీ ఫేమ్ బేబి ఖుషి ఈ సినిమాలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. మంగళవారం ఖుషి పుట్టినరోజు సందర్భంగా ఈ చిత్రం నుంచి బర్త్‌డే పోస్టర్ రిలీజ్ చేశారు. ఖుషి 'మన శంకర వరప్రసాద్ గారు' సినిమాలో చిరంజీవి కూతురి పాత్రలో నటించింది. ఇందులో ఆ చిన్నారి కీలక పాత్రతో మెప్పించనుందని చిత్రబృందం చెబుతోంది.


## లింగుస్వామి దర్శకత్వంలో నాగచైతన్య



అక్కినేని నాగచైతన్య 'తండేల్' సినిమాతో బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ హిట్ అందుకుని, ప్రస్తుతం 'విరూపాక్ష' చిత్రంతో సెన్సేషన్ క్రియేట్ చేసిన కార్తీక్ దండు దర్శకత్వంలో 'వృషకర్మ' అనే మైథికల్ మిస్టరీ థ్రిల్లర్ చేస్తున్నారు. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, షూటింగ్ కొనసాగుతోంది. నాగచైతన్య మరో సినిమాలో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఒకప్పుడు తనదైన మాస్, యాక్షన్ చిత్రాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన కోలీవుడ్ సీనియర్ దర్శకుడు లింగుసామి ఈ సినిమాను తెరకెక్కించబోతున్నట్లు సమాచారం. తెలుగులో రామ్ పోతినేని హీరోగా 'ది వారియర్' మూవీ తీసి భారీ డిజాస్టర్ అందుకున్న లింగుసామి ఇటీవల చైతు కోసం ఒక పవర్‌ఫుల్ మాస్ కథను సిద్ధం చేశారట. ఆ కథ విన్న నాగచైతన్యకు బాగా నచ్చడంతో సినిమా చేయడానికి ఒప్పుకున్నట్లుగా ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది.

# 89 శాతం పచ్చదనంతో శేషాచలం అడవులు

## దేశంలోనే రికార్డ్...



**తిరుపతి–ఆంధ్రనాడు, మే 19:** 89.40 శాతం పచ్చదనంతో తిరుమల గిరులు కళకళలాడుతున్నాయి. అరణ్య సంపద పరిరక్షణలో టీటీడీ అటవీ శాఖ దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. స్థానిక వృక్ష సంపద పునరుద్ధరణకు విస్తృత చర్యలు తీసుకుంటున్నారు. 576 హెక్టార్లలో స్వదేశీ మొక్కల పెంపకం చేపట్టారు. ప్రత్యేక నర్సరీల ద్వారా నాణ్యమైన మొక్కల సరఫరా చేస్తున్నారు. ఏనుగులు, చిరుతలు సహా వన్యప్రాణుల రక్షణకు చర్యలు తీసుకున్నారు. ఆలయ పూజ కైంకర్యాలలో అటవీ శాఖ పాత్ర కీలకంగా మారిందితిరుమల గిరులు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.. ఏకంగా 89.40 శాతం పచ్చదనం కనిపిస్తోంది. 1980 నుంచి టీటీడీ అటవీ శాఖ శేషాచల అరణ్య సంపదను పరిరక్షిస్తూ, పర్యావరణ సమతుల్యతను కాపాడుతోంది. కోట్లాది మంది భక్తుల ఆధ్యాత్మిక అవసరాలకు అనుగుణంగా సేవలు అందిస్తోంది. తూర్పు కనుమల్లో విస్తరించిన పవిత్ర శేషాచల పర్వత శ్రేణుల్లోని అరణ్య ప్రాంతాలను సంరక్షిస్తూ జీవ వైవిధ్య పరిరక్షణలో కీలకంగా మారింది. టీటీడీ అటవీ విభాగ పరిధిలో మొత్తం 2719 హెక్టార్ల విస్తీర్ణంలో అరణ్య ప్రాంతం ఉంటే.. తాజా ఐఎస్ఎఫ్ఆర్ (ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ నివేదిక) ప్రకారం 89.40 శాతం మేర అటవీ ప్రాంతం నమోదైంది. దేశంలోనే అత్యుత్తమైన స్థానంలో నిలిచింది. దాదాపు 2431 హెక్టార్లలో అటవీ ప్రాంతాలు ఉండగా.. వాతావరణ నియంత్రణ, జీవ వైవిధ్య సంరక్షణకు దోహదపడుతున్నాయి. డిప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్స్ ఆధ్వర్యంలో టీటీడీ అటవీ విభాగం కొనసాగుతోంది. మొత్తం నాలుగు ఫారెస్ట్ రేంజ్‌లు తిరుమలలో రెండు, తిరుపతిలో రెండు చొప్పున ఉన్నాయి. ఇలా ప్రతి రేంజ్ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పర్యవేక్షణలో ఉంటుంది. అటవీ పరిరక్షణను ఫీల్డ్ స్థాయిలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, సిబ్బంది సమన్వయంతో చేపడుతున్నారు. 24 గంటల ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరం పహారా ఉంటూ అటవీ సంపద సంరక్షణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. వీరు అక్రమ చెట్ల నరికివేత, వేట చర్యలను అరికడుతున్నారు. అటవీ అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక ఫైర్ లైన్లతో పాటుగా శిక్షణ పొందిన బృందాలు అగ్నిమాపక చర్యలు చేపడుతున్నాయి. ప్రతి ఏంటా 26.5 లక్షల చదరపు మీటర్ల మేర ఫైర్ లైన్లు నిర్వహిస్తున్నారు. టీటీడీ జీవ వైవిధ్య పరిరక్షణలో భాగంగా విదేశీ జాతికి చెందిన అకేషియా చెట్ల స్థానంలో స్థానిక వృక్ష సంపదను పునరుద్ధరించే కార్యక్రమాన్ని చేపట్టింది. మొత్తం 576 హెక్టార్లలో స్థానిక జాతులైన గంధం, ఎర్రచందనం, ఉసిరి, నేరేడు, రావి, మర్రి, జువ్వి, మేడి, సంపంగి, మామిడి వంటి మొక్కలను దశలవారీగా నాటుతున్నారు. ఇప్పటివరకు 22 హెక్టార్లలో పనులు పూర్తయ్యాయి. అంతేకాదు టీటీడీ పరిధిలోని నాలుగు ఫారెస్ట్ రేంజ్‌లలో ప్రత్యేక నర్సరీలను నిర్వహిస్తున్నారు. అక్కడ స్థానిక జాతుల మొక్కలు, అలంకార మొక్కలు, ఔషధ మొక్కలను పెంచుతున్నారు. ఈ నర్సరీల ద్వారా అటవీ పునరుద్ధరణ కార్యక్రమాలకు అవసరమైన నాణ్యమైన మొక్కలను సరఫరా చేస్తున్నారు. శేషాచల అటవీ ప్రాంతంలో ఎన్నో వన్యప్రాణులు నివసిస్తున్నాయి. మానవ ? వన్యప్రాణి ఘర్షణలను తగ్గించేందుకు, గాయపడిన జంతువులను రక్షించేందుకు టీటీడీ అటవీ విభాగం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. వేసవి తీవ్రత దృష్టిలో ఉంచుకుని అటవీ ప్రాంతాల్లో జంతువుల దాహార్తి తీర్చేందుకు ప్రత్యేక నీటి గుంతలు ఏర్పాటు చేసి వాటిలో నీటిని నింపుతున్నారు. తిరుమలలో దర్శన క్యూ లైన్ ప్రాంగణాల్లో మూడు స్నేక్ రెస్క్యూ బృందాలను నిరంతరం అప్రమత్తంగా ఉంటారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రమాదకరమైన చెట్లను గుర్తించి తొలగించడం, గాలివానల కారణంగా పడిపోయిన చెట్లను తొలగించడం, రహదారుల పక్కన చెట్ల కొమ్మలను క్రమం తప్పకుండా తొలగిస్తున్నారరు. తిరుమల, టీటీడీ ఆలయ అవసరాల కోసం అవసరమైన శ్రీగంధం చెక్కలు, వంట చెరుకు, దర్భ గడ్డి, ఇతర పూజా సామగ్రిని టీటీడీ ఫారెస్ట్ విభాగం సమకూరుస్తోంది.

తిరుమల, తిరుపతిలోని రహదారి డివైడర్లు, ఉద్యానవనాలు, పచ్చదన అభివృద్ధి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తోంది. మొత్తం 24 కిలోమీటర్ల మేర రహదారి డివైడర్లు, 25 ఉద్యానవనాలను సంరక్షిస్తోంది. వీటితో పాటుగా అరుదైన, ఔషధ గుణాలు ఉన్న వృక్ష జాతుల పరిరక్షణపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టారు. ఆయుర్వేద ఔషధాల తయారీకి అవసరమైన ముడి పదార్థాలను కూడా సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం పవిత్ర వనం, దివ్య ఔషధ వనం, పలమనేరు టింబర్ ప్లాంటేషన్, వన్యప్రాణి ఘర్షణల నివారణకు వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా భాగస్వామ్యం.. కొండల పచ్చదనం పెంపు వంటి పలు కీలక ప్రాజెక్టులను టీటీడీ ఫారెస్ట్ విభాగం అమలు చేస్తోంది.

## నీట్ పరీక్ష రద్దు అయిన నేపథ్యంలో అమ్ముడుపోయిన భవిష్యత్తు

**తిరుపతి–ఆంధ్రనాడు, మే 19:** కలల మెట్లెక్కే వయసులోకన్నీటి గవాక్షాల దగ్గర నిలబడ్డాడు విద్యార్థిచేతిలో పుస్తకం ఉన్నా, గుండెలో మాత్రం భయం మొలిచింది. రాత్రింబవళ్లు వెలిగించిన దీపాలన్నీఒక "లీక్" చీకటిలో మసకబారుతున్నాయి. చెమట చుక్కలతో రాసుకున్న భవిష్యత్తు కొంతమందికి కాగితపు వ్యాపారమైపోతోం ది. ఇది కేవలం ప్రశ్నపత్రం లీక్ కాదు నమ్మకానికి జరిగిన బహిరంగ ద్రోహం,అంకితభావం మీద వేసిన అవమాన ముద్ర, ప్రతిభను తాకిన రాజకీయ గ్రహణం. ఏళ్ల తరబడి ఆశల్ని మూట గట్టుకు నికోచింగ్ గదుల్లో బంధించుకున్న యవ్వనం,తల్లిదండ్రుల అప్పులపై నిలిచిన కలలు, మధ్యతరగతి గుండెల్లో దాచుకున్న భవిష్యత్తు ఒక్క క్షణంలో చిద్రమవుతోంది. కార్పొరేట్ మాయాజాలం ఒక వైపు,ప్రభుత్వాల నిర్లక్ష్యం మరో వైపు మధ్యలో సామాన్య విద్యార్థి నిశ్శబ్ద యుద్ధం చేస్తున్న సైనికుడు. పరీక్ష హాలులో కూర్చున్న ప్రతి కన్ను సమాధానం కోసం కాదు. న్యాయం కోసం ఎదురుచూస్తోంది. ఎందుకంటేప్రశ్నలు కఠినం కావడం బాధ కాదు,వ్యవస్థే కుళ్లిపోవడం అసలైన విషాదం. రేపటి వైద్యుడు, శాస్త్రవేత్త, ఉపాధ్యాయుడు లీకుల నీడలో పుట్టకూడదు;తన ప్రతిభ వెలుగులోనే ఎదగాలి. ప్రశ్నపత్రం అమ్ముడుపోయిన ప్రతి సారిఒక విద్యార్థి ఆశయిం చనిపోతుంది;ఒక కుటుంబం నమ్మకం కూలిపోతుంది;ఒక సమాజం భవిష్యత్తు చీకటిలోకి జారిపోతుంది. ఇంకెన్నాళ్లు ఈ దోబూచులాట? ఇంకెన్నాళ్లు కలల వ్యాపారం? విద్యను అంగడిలో పెట్టిన చేతుల కంటేవిద్యార్థి కలలు గొప్పవనిఈ దేశం తెలుసుకునే రోజు రావాలి. అప్పుడు మాత్రమేచెమటకు విలువ ఉంటుంది, ప్రతిభకు గౌరవం ఉంటుంది, భవిష్యత్తు అమ్ముడుపోని ఆశగా మిగులుతుంది. రచన మల్లారపు నాగార్జున, 9398000686.

## ఫేక్ కరెన్సీ గ్యాంగ్‌తో పోలీసులు

**నెల్లూరు –ఆంధ్రనాడు, మే 19:** చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు (జీడి నెల్లూరు) పరిధిలో దొంగనోట్ల ముఠా కలకలం రేపింది. తాము పోలీసులం అని బెదిరించి. కొబ్బరికాయలు కొనుగోలు చేయడానికి వచ్చిన వ్యాపారుల వద్ద నుంచి రూ. 10 లక్షల అసలు నగదును బలవంతంగా లాక్కొని పరారయ్యారు. ఈ కేసులో అత్యంత షాకింగ్ విషయమేమిటంటే.. దొంగనోట్లు మార్పిడి చేసే ఈ ముఠాతో చేతులు కలిపి చిత్తూరు ట్రాఫిక్ ఏఎస్ఐ లోకనాథం, ఏఆర్ కానిస్టేబుల్ రవి తీవ్ర అక్రమాలకు పాల్పడ్డారు. చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే దొంగలతో కలిసి దోపిడీకి ప్లాన్ చేయడం స్థానికంగా తీవ్ర సంచలనంగా మారింది. పోలీసుల వివరాల ప్రకారం.. జీడి నెల్లూరు మిట్ట హరిజనవాడకు చెందిన సెల్వం, దేవా, తమిళనాడులోని వేలూరుకు చెందిన ఇళంగోవన్, చిత్తూరు ట్రాఫిక్ ఏఎస్సై లోకనాథం, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ రవి కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. తాము తక్కువ ధరకే దొంగనోట్లు ఇస్తామంటూ తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన మంజు, విజయ్ అనే వ్యక్తులకు ఎర వేశారు. పది లక్షలు ఇస్తే అందుకు కోటి రూపాయల ఫేక్ కరెన్సీ ఇస్తామని నమ్మించారు. వారి మాటలు నమ్మిన బాధితులు రూ. 10 లక్షల అసలు నగదు తీసుకుని వారు చెప్పినట్లుగానే గంగాధర నెల్లూరుకు వచ్చారు. బాధితులు అక్కడికి చేరుకోగానే.. ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం ఏఎస్ఐ, కానిస్టేబుల్ రంగంలోకి దిగి తాము పోలీసులమంటూ బెదిరించి వారి వద్ద ఉన్న రూ. 10 లక్షల క్యాష్‌ను బలవంతంగా లాక్కొని ముఠాతో కలిసి పరారయ్యారు. ఈ మోసంపై బాధితులు వెంటనే జీడి నెల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తాము కేవలం కొబ్బరికాయల వ్యాపారం నిమిత్తం కొనుగోలు చేయడానికి వస్తే.. కొందరు పోలీసులం అని బెదిరించి, దొంగనోట్ల ముఠాతో కలిసి తమను మోసం చేశారని వాపోయారు. బాధితుల ఫిర్యాదుపై గంగాధర నెల్లూరు సీఐ ప్రసాద్ తక్షణమే స్పందించి గాలింపు చర్యలు చేపట్టారు. కేవలం గంటల వ్యవధిలోనే దొంగనోట్ల ముఠా సభ్యులతో పాటు వారికి సహకరించిన పోలీసులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బట్టుకండిగ గ్రామం వద్ద ఏఎస్సై, హెడ్ కానిస్టేబుల్ సహా ముఠా సభ్యులను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన సీఐ ప్రసాద్.. నిందితులను పూర్తి స్థాయిలో విచారిస్తున్నారు.




Printed, Published Edited and Owned by M.HARIBABU, Printed at AKSHARA PRINTERS, 1st Floor, SSS Complex, Air Bypass Road, Tirupati Town, Tirupati District, A.P., Published at AKSHARA PUBLICATIONS, Tirupati, Editor : M.Hari Babu , Cell : 9490400684, RNI: 2009/28733